# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 3 | సంచిక : 26 | గురువారం 17 అక్టోబర్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



## ఏపీలో రిపోర్ట్ చేయాల్సిందే

- ఏపీ, తెలంగాణ ఐఏఎస్ అధికారులకు హైకోర్టులో చుక్కెదురు
- తమను రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని ఐఏఎస్ అధికారుల పిటిషన్
- ముందు మీరు డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో చేరాలని హైకోర్టు ఆదేశం
- మీరు ఎక్కడ పని చేయాలో కేంద్రం నిర్ణయిస్తుందన్న హైకోర్టు
- వాదనలు విని... ఐఏఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

-2లో



## సమగ్ర కులగణనకు కసరత్తు!



- ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు..
- ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది
- ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు
- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది

హైదరాబాద్

సమగ్ర కులగణన చేపట్టేందుకు జిల్లాల అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు. తెలంగాణ - మిగతా3లో



## జమ్ముకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం

- 68 ఇళ్లు దగ్ధం
- ఇళ్లు కాలిపోవడంతో నివాసితులు రోడ్డు పాలయ్యారు.
- అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి తాత్కాలిక టెంట్లలో ఆశ్రయం
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంతోపాటు పునరావాసాన్ని కల్పించే చర్యలు

## ఇందిరమ్మ కమిటీలతో పార్టీ బలోపేతం

- కాస్త ఆలస్యమైనా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నా సీఎం
- పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి ఇందిరమ్మ కమిటీలను ఓ అవకాశంగా ఉపయోగించుకోవాలని నిర్ణయం
- గ్రామాలన్నింటిపై ఇందిరమ్మ కమిటీల ప్రభావం ఉండేలా ప్రణాళిక
- ప్రభుత్వ ప్రతి పథకం ప్రజలకు ఇందిరమ్మ కమిటీల ద్వారానే చేరుతుందని ప్రభుత్వం యోచన



హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాలన ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి ఇందిరమ్మ కమిటీలను ఓ అవకాశంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. కాస్త ఆలస్యమైనా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల నాటికి గ్రామాలన్నింటిపై ఇందిరమ్మ కమిటీల ప్రభావం ఉండేలా చూసుకోనున్నారు. అంటే.. ప్రతి ప్రభుత్వ లబ్ధిదారుడు కాంగ్రెస్ ను దాటిపోడు. అంతే కాదు ఇతర కాంగ్రెస్ సంప్రదాయ ఓటర్లనూ చేజారిపోకుండా చూసుకోవచ్చు. - మిగతా3లో



## ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి

- సీఎం ఎవరో సంకేతాలిచ్చిన దేవేంద్ర ఫడ్నవీస్
- "సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన పని మాకు లేదు
- మా ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నారు
- ఎలాగూ అధికారంలోకి రామని తెలిసే సీఎం అభ్యర్థిని ఎంవీఏ ప్రకటించడం లేదు

### తెలంగాణ ఉన్నత విద్యామండలి
## ఛైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

- వైస్ ఛైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం నియామకం
- ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు
- ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ప్రకటన
- కోఠి మహిళా యూనివర్సిటీ ఇంఛార్జి వీసీగా ధనావత్ సూర్య

హైదరాబాద్

తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైస్ ఛైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. వీరిద్దరూ ఆయా పదవుల్లో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. కాగా, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రస్తుతం నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్నారు. ఈ రెండు నియామకాలతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు ఇంఛార్జి - మిగతా3లో





## మోదీ దీపావళి గిఫ్ట్..

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు
- 48లక్షల ఉద్యోగులు.. 67లక్షల మంది పెన్షనర్లకు గుడ్‌న్యూస్..
- వారణాసిలో రూ.2,642 కోట్లతో రైల్-రోడ్ బ్రిడ్జి
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
- రబీలో ఆరు పంటల కనీస మద్దతు ధర పెంపు..
- యూరియేతర ఎరువుల సబ్సిడీకి కేంద్రం ఆమోదం

-2లో

### విమానాలకు బాంబు బెదిరింపులు..
## కీలక నిర్ణయం తీసుకున్న కేంద్రం!

- దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల నుంచి వచ్చే విమానాల్లో స్కై మార్షల్స్‌ని రెట్టింపు చేయాలని నిర్ణయం
- గడిచిన మూడురోజుల్లో 12 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి
- ఈ క్రమంలో భద్రతా ఏజెన్సీలు తనిఖీలు నిర్వహించి.. ఫేక్ బెదిరింపులుగా తేల్చారు



## ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు

- రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి
- కానీ ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తానంటోంది
- రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తే ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం పడుతుంది
- ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం 158 కి.మీ. మేర కేంద్రమే నిర్మిస్తోంది.
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్

ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంత మంది నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి. కానీ ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తానంటోంది. రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తే ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం పడుతుంది. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం 158 కి.మీ. మేర కేంద్రమే నిర్మిస్తోంది. ఉత్తర భాగం నిర్మాణం కోసం భూసేకరణ ఇంకా ప్రారంభించలేదని హరీశ్‌రావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రతి నియోజకవర్గానికి రూ. 5 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో చెప్పారు. 6 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వెంటనే నియోజకవర్గ - మిగతా3లో



# ఏపీలో రిపోర్ట్ చేయాల్సిందే

**హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టులో ఐఏఎస్ అధికారులకు చుక్కెదురైంది. తమను రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న ఐఏఎస్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో ముందు మీరు విధుల్లో చేరాలని అధికారులకు హైకోర్టు సూచించింది. అయితే కేటాయింపునకు సంబంధించి పునఃపరిశీలన చేయాలని డీవోపీటీని ఆదేశించమంటారా? అని అధికారులను అడిగింది. ఇలాంటి అంశాలపై స్టే ఇస్తూ వెళితే కనుక ఎన్నటికీ తేలదని హైకోర్టు వ్యాఖ్యానించింది. మీరంతా బాధ్యతాయుతమైన అధికారులు... ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉండవద్దని హితవు పలికింది. మీరు ఎక్కడ పని చేయాలో కేంద్రం నిర్ణయిస్తుందని స్పష్టం చేసింది.

ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల్లోనే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్న ఏపీ, తెలంగాణకు కేటాయించిన క్యాడర్ సివిల్ సర్వీస్ అధికారులకు హైకోర్టులో కూడా ఊరట లభించలేదు. డీవోపీటీ ఆదేశాల మేరకు వెళ్లి కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని సూచించింది. మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ విషయంలో ఇచ్చిన ఉత్తర్వులే వీరి విషయంలోనూ వర్తిస్తాయని కేంద్రం తరపు న్యాయవాది హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే తమ సొంత ప్రాంతాలను తప్పుగా నిర్ధారించినందున తమ క్యాడర్ ను మార్చాలని కోరుతున్నారని అందుకే ముందస్తుగా ఉత్తర్వులపై స్టే



ఇవ్వాలని ఐఏఎస్‌ల తరపు న్యాయవాది కోరారు. అయితే ఐఏఎస్‌లు అయినంత మాత్రాన స్టే ఎలా ఇస్తామని కోర్టు ప్రశ్నించింది. అయితే ఐఏఎస్‌లకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ఐఏఎస్‌లను ఇప్పటికిప్పుడు రిలీవ్ చేయడం కష్టమని కనీసం పదిహేనురోజుల సమయం ఉండాలని అఫిడవిట్ దాఖలు చేసింది. ట్రిబ్యూనల్ కొట్టేస్తే హైకర్టుకు రావడం సరి కాదని కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లి రిపోర్టు చేసిన తర్వాతనే పిటిషన్‌పై విచారణ జరుపుతామన్నారు. సివిల్ సర్వీస్ అధికారులు ఎక్కడ కేటాయిస్తే అక్కడకు వెళ్లి విధి నిర్వహణలో పాల్గొనాలన్నారు. వాదనలు పూర్తయిన తర్వాత తీర్పు ను రిజర్వ్ చేశారు. ఆయా రాష్ట్రాల్లో రిపోర్టు చేసిన తర్వాతనే విచారణ చేస్తామని హైకోర్టు స్పష్టం చేయడంతో కేటాయించిన క్యాడర్ రాష్ట్రానికి వెళ్లి రిపోర్టు చే?యల్సిన తప్పని పరిస్థితి ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఏర్పడింది. తెలంగాణ నుంచి ఐఏఎస్‌లు ఏపీ క్యాడర్‌కు వెళ్లాల్సి ఉంది. వారిలో గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ కాట అమ్రపాలి కూడా ఉన్నారు. రోనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణి ప్రసాద్ ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉంది. అలాగే ఏపీ నుంచి గరిమెళ్ల సృజన, శివశంకర్, హరికృష్ణ తెలంగాణలో రిపోర్టు చేయాల్సి ఉంది. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో అధికారులను ప్రత్యూష్ సిన్హా కమిటీ విభజించింది. యూపీఎస్సీ రికార్డుల ప్రకారం శాశ్వత నివాసం ఆధారంగా ఏపీ అయితే ఏపీకి..తెలంగాణ అయితే తెలంగాణకు కేటాయించారు. కొంత మంది కాట అమ్రపాలి తమ శాశ్వత అడ్రస్ ను విశాఖగా పేర్కొనడంతో ఆమెను ఏపీకి కేటాయించారు. ఇలాగే ఇతరుల్ని కేటాయించారు. కేటాయింపులపై అప్పట్లో క్యాట్ కు వెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చుకుని తమకు నచ్చిన రాష్ట్రాల్లో కొనసాగుతున్నారు.తెలంగాణ చీఫ్ సెక్రటరీగా పని చేసిన సోమేష్ కమార్ కు కూడా ఏపీ క్యాడరే కేటాయించారు. ఆయనకు కూడా గతంలో కోర్టు వ్యతిరేక తీర్పు ఇచ్చింది. దాంతో ఆయన సీఎస్ పదవి నుంచి వైదొలిగి ఏపీలో రిపోర్టు చేశారు. తర్వాత వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. అదే తీర్పు ప్రస్తుత ఐఏఎస్‌లకూ వర్తిస్తుంది.

## జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఒమర్ అబ్దుల్లా..



ఇవాళ ఉదయం జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్ర నేత ఒమర్ అబ్దుల్లా మధ్యాహ్నం సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుంటున్నట్టు ఆయన సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. అనంతరం జమ్ముకశ్మీర్ ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన సెక్రెటరీలతో ఒమర్ సమావేశమయ్యారు. జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. కాగా ఉదయం 11.30 గంటలకు ఒమర్ అబ్దుల్లా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీనగర్‌లోని 'షేర్ ఇ కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్'లో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా తదితరులు ఉన్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, పీడీపీ అధ్యక్షురాలు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్, సీపీఐ నేత డీ రాజా కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ఒమర్ అబ్దుల్లా గతంలో కూడా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీ, పీడీపీ కూటమి అక్కడ అధికారం చేపట్టింది. 2018లో కూటమి సర్కారు కూలిపోవడంతో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత కేంద్రం జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేసింది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం ఇప్పుడే తొలిసారిగా జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

# మోదీ దీపావళి గిఫ్ట్

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నరేంద్ర మోదీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీపావళి కానుకగా 3 శాతం కరవు భత్యాన్ని పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మూలవేతనంలో 50 శాతం ఉన్న డీఎం 53 శాతానికి చేరుతుంది. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి దీన్ని అమలు చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో 10 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది.

కాగా, సార్వత్రిక ఎన్నికలకు ముందు మార్చిలో డీఏను 4 శాతం కేంద్రం పెంచింది. అది జనవరి 2024 నుంచి అమల్లోకి వచ్చింది. మూడు నెలల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. ఏటా ప్రభుత్వం రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను సవరిస్తుంటుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ కరవు భత్యాన్ని నిర్ణయిస్తారు. ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (ఏఐసీపీఐ) ఆధారంగా డీఏ పెంపుదలను లెక్కిస్తారు.


### వారణాసిలో రూ.2,642 కోట్లతో రైల్-రోడ్ బ్రిడ్జి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర మంత్రివర్గం బుధవారంనాడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. వారణాసిలో గంగానదిపై కొత్త రైల్-రోడ్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జనసామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచంలోని అతి పెద్ద వంతెనల్లో ఇదొకటి అవుతుందని క్యాబినెట్ సమావేశానంతరం రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు.

రూ.2,642 కోట్లతో..

కొత్త రైల్-రోడ్ బ్రిడ్జిని రూ.2,642 కోట్లతో నిర్మించనున్నట్టు అశ్విని వైష్ణవ్ తెలిపారు. "మాల్వీయ బ్రిడ్జి కట్టి 137 ఏళ్లయింది. ఇప్పుడు కొత్త బ్రిడ్జి నిర్మాణం జరపనున్నాం. లోయర్ డెక్‌లో 4 రైల్వే లైన్లు, అప్పర్ డెక్‌పై 6 లేన్ల హైవే ఉంటుంది. ట్రాఫిక్ కెపాసిటీ దృష్ట్యా ప్రపంచంలోనే అతి పెద్ద బ్రిడ్జిలలో ఇదొకటి అవుతుంది" అని మంత్రి తెలిపారు.

కాగా, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి-చౌందాలి జిల్లాల గుండా కొత్త వంతెన నిర్మాణం జరుగనుందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇండియన్ రైల్వేస్‌కు క్రూషియల్ హబ్‌గా వారణాసి రైల్వే స్టేషన్ ఉందని, యాత్రికులు, పర్యాటకులు, స్థానిక జనాభాకు గేట్‌వేగా నిలుస్తోందని పేర్కొంది. పెరుగుతున్న టూరిజం, ఇండస్ట్రియల్ డిమాండ్‌కు అనుగుణంగానే కొత్త రైల్-రోడ్ బ్రిడ్జి నిర్మాణం జరగనుందని తెలిపింది. ఇందువల్ల ఈ ప్రాంత సామాజిక-ఆర్థిక వృద్ధి కూడా పెరుగుతుందని, స్వయం ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొంది. ప్రధాన మంత్రి మోదీ 'న్యూ ఇండియా' విజన్,



'ఆత్మ నిర్భర్ భారత్' విజన్ దిశగా ఇదొక ముందడుగు అని అభివర్ణించింది.

### యూరియేతర ఎరువుల సబ్సిడీకి కేంద్రం ఆమోదం

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, రైతులకు శుభవార్త చెప్పింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3శాతం డీఏను పెంచనున్నట్లు ప్రకటించింది. 2025-26 రబీలో ఆరు పంటలకు కనీస మద్దతు ధరను కేంద్రం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలు కేబినెట్ ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. ఆరుపంటల కనీస మద్దతు ధరను పెంచుతున్నట్లు వెల్లడించింది. గోధుమల కనీస మద్దతు ధరను రూ.2425, బార్లీ మద్దతు ధరను రూ.1,980. మినుములు రూ.5,650, కందులు రూ.6,700, ఆవాలు రూ.5,950, కుసుమల ధరను రూ.5,940 పెంచుతున్నట్లు ప్రకటించింది. అలాగే, రబీలో యూరియేతర ఎరువులకు రూ.24,475 కోట్ల రాయితీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### ఉద్యోగులకు డీఏ ఎంత పెరుగుతుంది..

ఒక ఉద్యోగి బేసిక్ వేతనం రూ.18వేలు ఉంటే.. 53శాతం డియర్‌నెస్ అలవెన్స్ ప్రకారం.. సదరు ఉద్యోగి వేతనం ప్రతినెలా దాదాపు రూ.54. వరకు పెరుగుతుంది. ఉద్యోగి బేసిక్ వేతనం రూ.25వేలు నెలకు రూ.750 బెనిఫిట్ లభిస్తుంది. కార్మికుడి మూలవేతనం రూ.35వేలు అయితే నెలకు రూ.1050 అదనంగా చెల్లించనున్నారు. రూ.52వేల బేసిక్ జీతం అందుకుంటే కార్మికులకు.. డీఏ పెంపుతో నెలకు రూ.1,560 అదనంగా ప్రయోజనం పొందుతారు. రూ.లక్ష బేసిక్ వేతనం ఉంటే ఉద్యోగి అకౌంట్‌లో నెలకు రూ.3వేలకుపైగా అదనంగా జమ అవుతుంది. సాధారణంగా డీఏ, డీఆర్ రేట్స్ పెంపు ప్రకటన సెప్టెంబర్‌లో జరుగుతుంది. అయితే, డీఏ పెంపును అక్టోబర్‌లోనూ ప్రకటించిన సందర్భాలున్నాయి. అక్టోబర్ 3న జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశంలో రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్‌ను కేంద్రం ప్రకటించింది. రైల్వే ఉద్యోగులకు రూ.2029కోట్ల బోనస్‌ను ఆమోదించినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ నెల 9న జరిగిన కేబినెట్ సమావేశంలో డీఏ ప్రకటిస్తారని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆశించారు. సెప్టెంబర్ 30న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌బీ యాదవ్ కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాశారు. జాప్యం చేయకుండా డీఏ పెంచాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో అలవెన్స్ ప్రకటిస్తే.. నవంబర్‌లో చెల్లింపులు చేయవచ్చన్నారు.

### ఆలస్యంతో కేంద్రానికే లబ్ధి

డీఏను సకాలంలో విడుదల చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వమే లాభపడుతున్నది ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఆర్థిక మంత్రికి రాసిన లేఖలో డియర్‌నెస్ అలవెన్స్ డియర్‌నెస్ రిలీఫ్ గడువు జూలై ఒకటిన ముగియనుందని.. సాధారణంగా సెప్టెంబర్‌లో చివరి వారంలో డీఏ పెంపు ప్రకటన ఉంటుందని ఎస్‌బీ యాదవ్ పేర్కొన్నారు. అక్టోబర్ మొదటి వారంలో ఉద్యోగులకు మూడునెలల బకాయిలు చెల్లించారు. అలవెన్సుల ప్రకటనలో జాప్యంపై కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నవరాత్రి, దుర్గాపూజ, దసరా పండగలు ముగిసినా కానీ పెంపుపై ప్రకటన చేయలేదు. డీఏ, డీఆర్ పెంపుతో ప్రభుత్వంపై రూ.వేలకోట్ల భారంపడుతుందని.. మూడు, నాలుగు నెలలు ఆలస్యంగా ప్రకటిస్తున్నది. ఈ కాలంలో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టి తద్వారా వడ్డీ ద్వారా ఆదాయం పొందుతుందని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. జనవరి ఒకటి, జూలై ఒకటి నుంచి డీఏ, డీఆర్ పెంచాలని నిబంధన ఉన్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతిసారీ మూడు నుంచి నాలుగు నెలలు ఆలస్యం చేస్తూ వస్తున్నది. ఇలా ఆలస్యమైతే ప్రభుత్వానికి వేలకోట్లు ఆదా అవుతాయని ఇండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (%ూ×ఇజుఖీ%) జనరల్ సెక్రటరీ, నేషనల్ కౌన్సిల్ (%జీజవీ%) స్టాఫ్ సైడ్ సీనియర్ సభ్యుడు సీ శ్రీకుమార్ పేర్కొన్నారు.

## జమ్ముకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఒక గ్రామంలో సుమారు 68 ఇళ్లు దగ్ధమయ్యాయి. ఇళ్లు కాలిపోవడంతో నివాసితులు రోడ్డు పాలయ్యారు. స్పందించిన అధికారులు బాధితులకు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. మంగళవారం మధ్యాహ్నం కిష్త్వార్‌లోని ముల్వార్వాన్ గ్రామంలో మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదంలో 68 ఇళ్లు కాలిపోయాయి. దీంతో వందలాది నివాసితులు కట్టుబట్టలతో మిగిలారు. చలి వాతావరణం నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఇళ్లు కోల్పోయిన బాధితులు కోరారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న అధికారులు స్పందించారు. అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి తాత్కాలిక టెంట్లలో ఆశ్రయం కల్పించారు. బాధిత కుటుంబాలకు ఆహారం, దుస్తులు, వైద్య, సహాయక సామగ్రిని అందించినట్లు కిష్త్వార్ డిప్యూటీ కమిషనర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే విపత్తు నిర్వహణ బృందాలను సంఘటనా స్థలానికి పంపినట్లు చెప్పారు. మరోవైపు ఈ అగ్నిప్రమాదంలో 40 ఇళ్ళు దెబ్బతిన్నట్లు తొలుత తెలిసిందని రాజేష్ కుమార్ తెలిపారు. అయితే మొత్తం 68 ఇళ్ళు కాలిపోయాయని చెప్పారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంతోపాటు పునరావాసాన్ని కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు.



## ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి

**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి మధ్య సీఎం అభ్యర్థి ఎవరనే విషయంలో సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. అధికార మహాయుతి ముందుగా సీఎం అభ్యర్థిని ప్రకటించి ఎన్నికలకు రావాలంటూ ఎంవీఏ సవాలు విసిరిన నేపథ్యంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తొలిసారి స్పందించారు. ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి అంటూ పరోక్షంగా సంకేతాలిచ్చారు. తమ ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నందున సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రకటించాల్సిన అవసరం మహాయుతి సర్కార్‌కు లేదన్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు అజిత్ పవార్, ఫడ్నవిస్ బుధవారంనాడిక్కడ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. "సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన పని మాకు లేదు. మా ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నారు. మరి మీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో ప్రకటించాలని పవార్ సాహెబ్ (శరద్ పవార్)ను నేను సవాల్ చేస్తున్నను" అని ఫడ్నవిస్ అన్నారు. ఎన్నికల తర్వాత ఎలాగూ అధికారంలోకి రామని తెలిసే సీఎం అభ్యర్థిని ఎంవీఏ ప్రకటించడం లేదన్నారు



### పవార్ ఏమన్నారు?


సీఎం అభ్యర్థి విషయంలో శరద్ పవార్ గత నెలలో స్పష్టతనిస్తూ, ఎన్నికలకు ముందు సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన అవసరం ఎంవీఏకు లేదని, సమష్టి నాయకత్వం కింద తమ కూటమి పోటీ చేస్తుందని చెప్పారు. సభ్యులను (గెలిచిన సీట్ల సంఖ్యను) బట్టే నాయకత్వ పగ్గాలు చేపట్టేదెవరనే నిర్ణయం ఉంటుందని, ఎన్నికలకు ముందు అలాంటి అవసరం లేదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నవంబర్ 20న జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడతాయి.

## వయానాడ్ నుంచి బరిలోకి ప్రియాంక

**న్యూఢిల్లీ :** మరో కీలక ఎన్నికల సమరానికి నగారా మోగింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీలతో పాటు కీలకమైన వయనాడు లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. నవంబర్ 13న వయనాడు పార్లమెంట్ స్థానానికి ఎన్నిక నిర్వహించనున్నట్టు ఈసీ ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు నవంబర్ 23న వయనాడు ఉప ఎన్నికకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుందిఈసారి కాంగ్రెస్ పార్టీకి మహారాష్ట్ర, జార్ఖండ్‌తో పాటు వయనాడు పార్లమెంట్ ఉప ఎన్నిక ఎంతో ప్రత్యేకమైందనే చెప్పాలి. ఇందుకు ప్రధాన కారణంగా గాంధీ కుటుంబానికి చెందిన ప్రియాంక గాంధీ ఇక్కడి నుంచి పోటీ చేయనుండటమే. గత సార్వత్రిక ఎన్నికల్లో వయనాడుతో పాటు యూపీలోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేశారు కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ. రెండు స్థానాల్లోనూ భారీ మెజార్టీతో గెలిచారు. ఈ రెండు స్థానాల్లో ఆయన ఏ సీటును వదులుకుంటారనే దానిపై కొద్దిరోజులు సస్పెన్స్ కొనసాగింది. అయితే రాయ్‌బరేలీ సీటు నుంచి ఎంపీగా కొనసాగాలని డిసైడయిన రాహుల్ గాంధీ.. వయనాడు ఎంపీ పదవికి రాజీనామా చేశారు. తాను వయనాడు ఎంపీగా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన రాహుల్ గాంధీ.. తన స్థానంలో వయనాడు నుంచి పోటీ చేయబోయేది ఎవరనే అంశంపై కూడా క్లారిటీ ఇచ్చేశారు. తన చెల్లెలు ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు.

# విమానాలకు బాంబు బెదిరింపులు.. కీలక నిర్ణయం తీసుకున్న కేంద్రం..!

దేశంలోని పలు విమానాలు, విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు భారీగా పెరిగాయి. ఈ బెదిరింపులు కేంద్ర ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల నుంచి వచ్చే విమానాల్లో స్కై మార్షల్స్‌ని రెట్టింపు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విమానాలు, విమానాశ్రయాలకు పెరుగుతున్న ముప్పును అంచనా వేసి.. నిఘా సంస్థల నుంచి వచ్చిన ఇన్‌పుట్స్ అందిన తర్వాత స్కై మార్షల్ సంఖ్యను రెట్టింపు చేయాలని నిర్ణయించినట్లు హోంమంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి తెలిపారు. గడిచిన మూడురోజుల్లో 12 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో భద్రతా ఏజెన్సీలు తనిఖీలు నిర్వహించి.. ఫేక్ బెదిరింపులుగా తేల్చారు. నిరంతరం పెరుగుతున్న బెదిరింపుల మధ్య బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో చర్చించింది. ఈ చర్చల్లో బెదిరింపులను గుర్తించడానికి, నో ఫ్లై జాబితాలో చేర్చేందుకు ఏజెన్సీలు కలిసి పని చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది. దాంతో పాటు ఎఫ్ఐఏ నివేదిక ఆధారంగా సెన్సిటివ్ కేటగిరిలో చేర్చిన కొత్త అంతర్జాతీయ మార్గాల్లో కొత్త బ్యాచ్ ఎయిర్ మార్షల్స్‌ని మోహరించనున్నట్లు అధికారి చెప్పారు. భద్రతా సంస్థలతో పలు సమావేశాల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పార్లమెంటరీ కమిటీ ముందు ఈ అంశాన్ని లేవనెత్తారు. విమానాశ్రయాలు, విమానాలకు వస్తున్న బెదిరింపుల అంశం బుధవారం పార్లమెంటరీ కమిటీలో వేడెక్కింది. ఈ విషయమై ఎంపీలు అడిగిన ప్రశ్నలకు పౌర విమానయాన శాఖ కార్యదర్శి వుమ్లున్మాంగ్ వుల్నమ్ స్పందిస్తూ.. నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు. ఏజెన్సీలు చర్యలు తీసుకుంటున్నాయని.. అధికారులు కొంత సమాచారాన్ని సేకరించాయన్నారు. ఫేక్ మెసేజ్‌లపై కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై విచారణ కొనసాగుతున్నందున.. సమాచారం సున్నితత్వాన్ని దృష్టిలో పెట్టుకొని వివరాలను చెప్పేందుకు ఆ అధికారి నిరాకరించారు.



### స్కై మార్షల్స్ అంటే..?

ఎయిర్ మార్షల్స్ తీవ్రవాద, హైజాకింగ్ నిరోధక చర్యల్లో పాల్గొంటారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్‌లోని విభాగం. స్కై మార్షల్ ప్రధానంగా అంతర్జాతీయ మార్గాలు, కొన్ని సున్నితమైన మార్గాల్లో మోహరిస్తుంటారు. స్కై మార్షల్స్ సాధారణ దుస్తుల్లో ప్రయాణికులతో కలిసి ప్రయాణిస్తుంటారు. కాందహార్‌లో ఎయిర్ ఇండియాకు చెందిన ఐసీ814 విమానాన్ని హైజాక్ చేసిన అనంతరం.. భవిష్యత్‌లో మరోసారి హైజాక్ జరుగకుండా ఉండేందుకు 1999లో భారత్ తొలిసారిగా స్కై మార్షల్స్‌ని ప్రవేశపెట్టింది. స్కై మార్షల్‌ని ఫ్లై సెక్యూరిటీ ఆఫీసర్ అని కూడా పిలుస్తారు.

# హైడ్రా కారణంగా భయానక వాతావారణం

**హైదరాబాద్ :** తెలంగాణ భవన్ లో నగర ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలతో మూసీ ప్రాజెక్టు పైన కేటీఆర్ సమావేశం నిర్వహించారు. తరువాత మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా హైదరాబాద్‌లో పేదలు దిగువ మధ్యతరగతి ప్రజలు సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభుత్వం అనాలోచితంగా, ప్రణాళిక లేకుండా పేదలకు ఎవరూ అండగా లేరన్నట్లుగా దూకుడుగా వారి మీదకు వెళ్తోంది. మోడీ నోట్ల రద్దు చేసినప్పుడు ఏ విధంగా రకరకాల కారణాలు మారుస్తూ చెప్పారో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్ధతి అవలంభిస్తోంది. ఒక రోజు మూసీ సుందరీకరణ అంటారు. ఒక రోజు నల్గొండకు నీళ్లు అంటారు. ఒక రోజు రూ. లక్షా 50 వేల కోట్లు ఎక్కడివి అంటారు. ఒక రోజు డీపీఆర్ లేనే లేదంటారని అన్నారు. ఒక ప్రణాళిక, ఆలోచన లేకుండా ముందుకు వెళ్తున్నారు. ప్రభుత్వమే 50 ఏళ్ల క్రితమే పర్మిషన్లు ఇచ్చి ఇప్పుడు వాటిని కూలగొడతామని దుందుడుకుగా పోతామంటే కుదరదు. హైడ్రా, మూసీ ప్రాజెక్ట్ విషయంలో ఒక భయానక వాతావారణాన్ని సృష్టించారు.

హైడ్రాను పెద్ద, పెద్ద బిల్డర్లను బెదిరించేందుకే ఉపయోగిస్తున్నారని మేము నమ్ముతున్నాం. మూసీ పేరిట ఏ విధంగా లూటీ చేస్తున్నారో ప్రజల దృష్టికి తీసుకెళ్తాం. మూసీ కి సంబంధించి 100 శాతం మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను మేము రూ. 4 వేల కోట్లతో నిర్మించామని అన్నారు.

మూసీ శుద్ధి మేము చేశాం. దీంతో ఇక నల్గొండ జిల్లాకు వెళ్లే నీళ్లన్ని శుద్ధి చేసిన నీళ్లే వెళ్తాయి. దాని కోసం కొత్తగా ఖర్చు చేయాల్సిన పని లేదు. కొండపోచమ్మ సాగర్ నుంచి గండిపేట్ కు నీళ్లు తెచ్చేందుకు 11 వందల కోట్లు ఖర్చు చేయాలని మేము నిర్ణయం తీసుకున్నాం. ఇక రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. నల్గొండకు మంచి నీళ్లు ఇచ్చే ఏర్పాట్లు మేము చేశాం. ఇక నల్గొండ కు నీళ్లు ఇచ్చే ఇష్టం లేదా అంటూ ముఖ్యమంత్రి గారు ఆరోపణలు చేయాల్సిన అవసరం లేదు. గతంలోనే మేము మూసీ సుందరీకరణ చేపట్టాలని సుధీర్ రెడ్డి ఛైర్మన్ గా ప్రయత్నం చేశాం. కానీ గరీబోళ్లకు అన్యాయం జరుగుతదంటే ఆ ప్రాజెక్ట్ వద్దని కేసీఆర్ చెప్పారు. మానవీయ ముఖ్యమంత్రి ఉంటే ఆ విధంగా నిర్ణయాలు ఉంటాయి. మూసీ సుందరీకరణ మేము కూడా చేశాం. కానీ ఒక్క పేదవాడి కడుపు కూడా కొట్టలేదు. మూసీ సుందరీకరణకు రూ. లక్షా 50 వేల కోట్లు ఎందుకో చెప్పాలి. 50 ఏళ్ల క్రితం పట్టాలిచ్చిన వారిని హైడ్రా పేరుతో కూల్చివేస్తామంటే కుదరదు, మీరు చేసిన తప్పునకు పేదలను బలి చేస్తారా? మీరే పట్టాలిచ్చి మీరే కూలగొడుతారా అని



ప్రశ్నించారు. పేదలకు ఎవరు దిక్కు లేరన్నట్లుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తామంటే బీఆర్ఎస్ ఊరుకోదు. హైదరాబాద్ లోని పేదలకు బీఆర్ఎస్ రక్షణ కవచంగా ఉంటుంది. రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా మా నాయకులు ఉంటారు. మేము నిర్మించిన అన్ని ఎస్టీపీలను కూడా మా ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటిస్తామని అన్నారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు నాలా డెవలప్ మెంట్ కార్యక్రమం తీసుకున్నాం. దాని ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలను కూడా సందర్శిస్తాం. హైడ్రా పేరుతో ప్రభుత్వం భయపెడుతున్న అన్ని ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజలకు మేము భరోసా ఇస్తాం. అదే విధంగా ప్రభుత్వం చట్టాన్ని గౌరవించకపోతే మేము న్యాయపరంగా కూడా పోరాటం చేస్తాం. ఆర్ఎస్ లీగల్ సెల్ కు దాదాపు 450 మంది వచ్చి అండగా ఉండాలని కోరారు. మా పార్టీ లీగల్ సెల్ ను మరింత బలోపేతం చేస్తాం. లీగల్ సెల్ వాళ్లు చాలా కష్టపడి పనిచేస్తున్నారు. వారికి అభినందనలు. ఈ ప్రభుత్వం చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తూ ప్రజలను కబ్జాదారులు అంటున్న విధానాన్ని ఎండగడతాం, హైడ్రా కారణంగా భయానక వాతావారణం వచ్చింది. మొన్న హైడ్రా పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం నాయకులే కొట్టుకున్నారు. ఈ ప్రభుత్వ దిక్కుమాలిన పాలన కారణంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయింది. మాకు అప్పు పుట్టటం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అంటున్నారు. మీ ముఖ్యమంత్రే దివాళా కోరు మాటలు మాట్లాడితే అప్పులు ఎలా పుడుతాయి. నిర్మాణం కాదు విధ్వంసం చేస్తామంటే ఇలాంటి పరిస్థితే ఉంటుంది. బీజేపీ నాయకుల కన్నా ఎక్కువగా రేవంత్ రెడ్డి దేశ రక్షణ గురించి మాట్లాడుతున్నాడు. ఆయన మాటలు ఆశ్చర్యంగా అనిపించాయి. దేశ రక్షణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉంది. ఏ మూసీ సుందరీకరణ అంటున్నావో, అదే ప్రాంతంలో 12 లక్షల చెట్లు నరికివేసి ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా ఎలా న్యాయం చేస్తారు. గంగా నది పుట్టిన గంగోత్రి వద్ద 150 కిలోమీటర్లు ఎకో సెన్సిటివ్ జోన్ అంట. మరి మూసీకి కనీసం 10 కిలోమీటర్ల ఎకో సెన్సిటివ్ జోన్ లేదా? మేమే కేబీఆర్ పార్క్ వద్ద ఫ్లై ఓవర్లు కట్టాలని అనుకున్నాం. పర్యావరణం దెబ్బతింటుందంటే ఆ ప్రతిపాదనలను విరమించుకున్నాం. 2017 లో రాడార్ నిర్మాణం కోసం జీవో ఇచ్చినప్పటికీ పర్యావరణం దెబ్బ తింటుందంటే మేము ఆ జీవో ను తొక్కి పెట్టామని అన్నారు. మేము జీవో ఇచ్చామని చెబుతున్నావ్. మేము చేసిన పనులన్నీ చేస్తున్నావా? రైతు బంధు, 24 గంటల కరెంట్, ఫించన్, పాలమూరు ఎత్తిపోతల మేము చేశాం. మరి నువ్వు వాటిని చేస్తున్నావా? మేము పర్యావరణ రక్షణ కోసం పనిచేశాం కాబట్టే ఇచ్చిన జీవోలను నిలిపివేశాం. రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీని ఒక్క మాట అనాలంటే దడ. అందుకే మనకు కేంద్ర బడ్జెట్ లో అన్యాయం జరిగినప్పటికీ అసెంబ్లీలో ఒక్క మాట మాట్లాడలేదని అన్నారు. జనవాసాలు లేని చోట పెట్టే రాడార్ కేంద్రాన్ని?తెలంగాణలో ఎందుకు పెట్టినట్లు? మూసీని పురిట్లోనే ఆగం చేసి కింద మాత్రం మంచి చేస్తామంటే ఎవరూ నమ్మతారు. హైదరాబాద్ లో ప్రజలకు భరోసా ఇచ్చేందుకు మా నాయకులంతా కలసికట్టుగా కదులుతాం. ప్రజలకు ఏమైనా ఇబ్బంది వస్తే మా ప్రజాప్రతినిధులను కలవండి. లేదంటే తెలంగాణ భవన్ కు రండి. మీకు న్యాయం తప్పకుండా జరగుతుంది. మా ఫార్మ్ హౌస్ లు చట్ట విరుద్ధంగా ఉంటే వాటిని కొట్టేయండి. మా ఫార్మ్ హౌస్ లు కూలగొడితే నీకు రాక్షస ఆనందం వస్తదంటే కూలగొట్టు. కానీ పేద ప్రజల జోలికి వెళ్లకు. పేద ప్రజలను ఆగం చేస్తామంటే వారి ఇళ్లు కూలగొడతామంటే ఊరుకోం, మేము అధికారంలోకి వచ్చే నాటికి ఉన్న బకాయి ఫీజు రీయింబర్స్ మెంట్ 2 వేల కోట్లను చెల్లించాం. ప్రభుత్వం అనేది కంటిన్యూ ప్రాసెస్. గత ప్రభుత్వ బకాయిలను చెల్లించాలి. రూ. 650 కోట్లు ఇస్తే సరిపోతుందని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తే దాదాపు 12 లక్షల మందికి మేలు జరుగుతుంది. గత ప్రభుత్వాలు బకాయిలు పెడితే ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు కట్టాల్సిందే. అది నెక్స్ మేము అధికారంలోకి వచ్చినా తప్పదని అన్నారు. రేవంత్ రెడ్డి 10 నెలల్లో 80 వేల కోట్ల అప్పు చేశారు. ఒక్క కొత్త ప్రాజెక్ట్ కూడా చేపట్టలేదు. మరి అంత డబ్బు ఎక్కడికి పోయింది. మన రాష్ట్రం రెవెన్యూ సర్ ప్లేస్ స్టేట్. మనం అన్ని కట్టిన తర్వాత కూడా మిగులు ఉందని భట్టి చెప్పారు. మరీ ఎందుకు ఇంత పెద్ద ఎత్తున అప్పు చేశారో చెప్పాలి. హైడ్రా, మూసీ పేరుతో సృష్టిస్తున్న భయాకన వాతావారణం నుంచి ప్రజలను రక్షించేందుకు బీఆర్ఎస్ కదులుతోంది. త్వరలోనే షెడ్యూల్ ప్రకటిస్తామని అన్నారు.

# ఇందిరమ్మ కమిటీలతో పార్టీ బలోపేతం

-మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరవాత ఇందిరమ్మ కమిటీల ప్రస్తావన తెచ్చారు. ప్రభుత్వ ప్రతి పథకం ప్రజలకు ఇందిరమ్మ కమిటీల ద్వారానే చేరుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పార్టీని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా చేయాలని ఆయన అనుకున్నారు. కారణం ఏమైనా తర్వాత ఆలస్యం జరిగింది. రుమమాఫీని ప్రకటించారు. హడావుడిగా అమలు చేశారు. కానీ ఆ రుణమాఫీని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం సరిగ్గా జరగలేదు. ఇందిరమ్మ కమిటీలు ఉంటే నేరుగా ఇంటింటికి తీసుకెళ్లేవారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పుడు ఆ కమిటీ చేతుల మీదుగానే ఇళ్ల నిర్మాణ పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేయబోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్ని ఇప్పటికే నిర్వహించాల్సి ఉంది. కానీ కులగణన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇప్పుడు ప్రక్రియను ప్రారంభించారు. నివేదిక వచ్చిన తర్వాత ఇతర చట్టపరమైన పనులు పూర్తి చేసి ఎన్నికలు నిర్వహించాలంటే మరో నాలుగైదు నెలల సమయం పట్టవచ్చు. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ పాలక మండలులు గడువు మాత్రమే ఇప్పటికి ముగిసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల గడువు



మరో ఏడాది వరకూ ఉంది. అన్నీ ఒకే సారి పెట్టేద్దామని అనుకుంటే.. మరో ఏడాది తర్వాత ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అప్పటికి ఇందిరమ్మ కమిటీ గ్రామాల్లో పట్టు సాధించే అవకాశం ఉంది. నిజానికి ఇందిరమ్మ కమిటీలు వంటి ఏర్పాటు రెండు వైపులా పదునున్న కత్తి లాంటివి. ఎందుకంటే ఎంత ప్లస్ ఉంటుందో అంత మైనస్ ఉంటుంది. ఈ కమిటీల సభ్యులు ప్రజలతో పారదర్శకంగా వ్యవహరించారు. అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని ఎక్కడైనా పక్షపాతం చూపించినట్లుగా ఆరోపణలు వస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుంది. అందుకే ఇందిరమ్మ కమిటీల సభ్యుల్లో కీలకమైన వ్యక్తుల్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంది. ఇప్పుడు సర్పంచ్‌లు లేరు కాబట్టి స్పెషలాఫీసర్లే కమిటీ ఛైర్మన్ గా ఉంటారు. అయినా పార్టీ నేతల ప్రభావం ఎక్కువ గానే ఉంటుంది. ఈ కమిటీలపై వ్యతిరేక ప్రచారం సహజం గానే జరుగుతుంది. కానీ ప్రజలు నమ్మకంగా ఉండేలా చూసుకోవడం ఆ కమిటీల మీదనే ఆధారపడి ఉంటుంది. అంతా సాఫీగా సాగితే కాంగ్రెస్ పార్టీ పునాదుల్ని ఇందిరమ్మ కమిటీలు మరింత బలోపేతం చేస్తాయని అనుకోవచ్చు.

# డ్రగ్స్ ఫ్రీ కోసం రంగంలోకి అకున్ సబర్వాల్

**హైదరాబాద్ :** తెలంగాణలో డ్రగ్స్ మాట వినపడాలంటే భయపడాలంటూ పిలుపునిచ్చారు. డ్రగ్స్ మహమ్మారితో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ఉద్యమాలకు కేరాఫ్ అయిన తెలంగాణ డ్రగ్స్ రాజ్యమేలుతోందని ఆ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే.. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాను తరిమికొట్టేందుకు వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని అర్థం అవుతోంది. ఇందుకోసం ఆయన ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి బాధ్యతల స్వీకరణ సందర్భంలోనూ రేవంత్ డ్రగ్స్ మహమ్మారిపై కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ తెలంగాణగా మారుస్తానంటూ శపథం చేశారు. తెలంగాణలో డ్రగ్స్ మాట వినపడాలంటే భయపడాలంటూ పిలుపునిచ్చారు. డ్రగ్స్ మహమ్మారితో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ఉద్యమాలకు కేరాఫ్ అయిన తెలంగాణ డ్రగ్స్ రాజ్యమేలుతోందని ఆ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే.. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాను తరిమికొట్టేందుకు వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే.. ఇటీవల రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కేటీఆర్ పై వ్యాఖ్యలు చేసిన సందర్భంగా సినీ నటుడు నాగార్జున ఫ్యామిలీని కూడా ప్రస్తావించారు. నాగచైతన్య-సమంత విడాకుల అంశాన్ని ఆమె లేవనెత్తారు. దాంతో నాగార్జున ఆ వ్యాఖ్యల్ని సీరియస్‌గా తీసుకున్నారు. అటు యావత్ టాలీవుడ్ సినీ ప్రపంచం కూడా



సురేఖ వ్యాఖ్యల్ని ఖండించారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి సురేఖ వ్యాఖ్యల్ని తప్పుబట్టారు. దాంతో ప్రతిపక్షంతో కలిసి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ హైడ్రా కూల్చివేసినప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించలేదు. అలాగే.. నంది అవార్డులను కాస్త గద్దర్ అవార్డులుగా మార్చినప్పుడు కూడా పెద్దగా పట్టించుకోలేదు. ఇక దాంతో అప్పటి నుంచే టాలీవుడ్ వర్సెస్ ప్రభుత్వం అన్నట్లుగా కోల్డ్‌వార్ నడుస్తూనే ఉంది. సురేఖ వ్యాఖ్యలపై ఒక్కసారిగా అందరూ ముందుకు రావడంతో ప్రభుత్వం పెద్దలు కూడా సీరియస్‌గా తీసుకున్నారు.ఇందులో భాగంగానే గతంలో టాలీవుడ్ డ్రగ్స్ కేసును మరోసారి తెరమీదకు తీసుకొచ్చేందుకు ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. అందుకే.. టాలీవుడ్ డ్రగ్స్ కేసులో కీలకంగా వ్యవహరించిన ఐపీఎస్ అకున్ సబర్వాల్‌ను మరోసారి తెలంగాణకు తీసుకొస్తున్నారు. మరోసారి ఆ కేసును తోడి అందులో భాగస్వాములైన వారిపై చర్యలు తీసుకునేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అయితే.. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ అప్పీల్‌తో పలువురు సినీ ప్రముఖులు డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా షార్ట్ వీడియోలు చేసి ప్రచారం సాగిస్తున్నప్పటికీ.. ఇంకా చాలా మంది టాలీవుడ్‌లో డ్రగ్స్ వినియోగిస్తున్నారని అపవాదు ఉంది.అందుకే..ఈ కేసుపై పూర్తి అవగాహన ఉన్న అకున్ సబర్వాల్‌ను మరోసారి రంగంలోకి దింపబోతోంది. అకున్ ఎంట్రీతో మరోసారి టాలీవుడ్‌లో ప్రకంపనలు మొదలు కానున్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే చాలా మంది టాలీవుడ్ ప్రముఖులను ఆయన విచారించారు. ఇంకా కొంత మందిని విచారించే క్రమంలో ఆయనను బదిలీ తప్పలేదు. దాంతో అప్పటి నుంచి ఆ కేసు మూలనపడింది. ఇక ఇప్పుడు ఆయన రాకతో ఈ డ్రగ్స్ కేసు ఎటు మలుపు తిరుగుతుందా అని ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఆ టెన్షన్ మరింత ఎక్కువైనట్లుగా ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేటుగా మార్చే క్రమంలో రేవంత్ సర్కార్ మరోసారి టాలీవుడ్ నుంచే తన పనిని మొదలుపెట్టబోతున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

-మొదటిపేజీ తరువాయి

వీసీలను ప్రభుత్వం మార్చింది. కోఠి మహిళా యూనివర్సిటీ ఇంఛార్జి వీసీగా ధనావత్ సూర్య, బాసర ట్రిపుల్ ఐటీ ఇంఛార్జి వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్‌ను నియమించారు. కాగా, సూర్య ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

## సమగ్ర కులగణనకు కసరత్తు!

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని గత కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటం విశేషం.

**సమగ్ర వివరాల సేకరణ**

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరచనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు. రాజకీయ అవకాశాలు లభిస్తాయని ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ మొత్తం జనాభాలో సుమారు 52 శాతం బీసీ జనాభా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనాదిగా ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఏళ్ల నుంచి ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఈ సర్వే జరిగే రెండు నెలల పాటు ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యుటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలిసింది. సర్కారు నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలుపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

## తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం...

**కారు కాల్వలో పడి ఏడుగురి మృతి**

**మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు**

**మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో విషాదం**

**కారు కాల్వలో పడటంతో నీళ్లలో మునిగి మృతి**




తెలంగాణలోని మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ కారు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మృతి చెందినవారిలో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు, ఓ పురుషుడు ఉన్నారు. మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలం ఉసిరికపల్లి వద్ద ఈరోజు సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులను పాముబండ తండాకు చెందిన వారిగా గుర్తించారు. రోడ్డుపై గుంతలు ఉండటంతో వేగంగా వెళుతున్న కారు కల్వర్టును ఢీకొట్టింది. కారు ఎగిరి పక్కనే ఉన్న కాల్వలో పడింది. దాంతో కారులో ఉన్న వారు నీట మునిగి చనిపోయారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

మెదక్ జిల్లా రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని, అవసరమైన సాయం అందించాలని ఆదేశించారు.

## ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉన్న పథకాలు బంద్ పెట్టడమే కాంగ్రెస్ తెచ్చిన మార్పు. మహిళలకు 2 బతుకమ్మ చీరలు ఇస్తామని రేవంత్ రెడ్డి మోసం చేశారు. రూ. 15 వేలు రైతుబంధు అన్నారు.. గుండుసున్నా చేశారు. కేసీఆర్ కిట్ కంటే మంచిది ఇస్తామని పేద గర్భిణులను మోసం చేశారు. ఆగస్టులో వేయాల్సిన చేప పిల్లలను, అక్టోబర్‌లో వచ్చినా వేయలేదు. చేప పిల్లల కోసం బడ్జెట్‌లో రూ. 16 కోట్లే పెట్టారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

**తెలంగాణలో 8,490 ఎంబీబీఎస్ సీట్లు..**

ఎంబీబీఎస్ చదువును గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరువ చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేద బిడ్డలు కూడా ఎంబీబీఎస్ చేసే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ పాలనను కొనియాడుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యకు హబ్‌గా మారిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మెడికల్ సీట్ల సంఖ్యలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఒకప్పుడు సామాన్యులకు అందుబాటులో లేని వైద్య విద్య ఇప్పుడు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణలో కేవలం ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ సంఖ్య 34కి చేరిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. 2014 వరకు తెలంగాణలో 2,850 మెడికల్ సీట్లు ఉంటే.. ప్రస్తుతం 8,490 సీట్లు ఉన్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాల వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఈ ఆల్ టైమ్ రికార్డును ఎవరూ చెరిపేయలేరని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## ఇద్దరు పిల్లల తల్లిపై మోజు పడి,,,

**హైదరాబాద్ :** సూరారం పీఎస్ పరిధిలో నాలుగు రోజుల కనిపించకుండా పోయిన చిన్నారి కేసు విషాదాంతమైంది. హైదరాబాద్ సూరారం బాలిక హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అనుమానితుడిగా తిరుపతి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించడంతో కీలక విషయాలు బయటకొచ్చాయి. మొత్తం కుటుంబాన్ని చంపేందుకు నిందితుడి కుట్ర చేసినట్లు పోలీసులు గుర్తించారు. బాలిక తల్లిపై మనసుపడ్డ నిందితుడు తిరుపతి.. ఇద్దరు పిల్లలు, ఆమె భర్తను చంపేందుకు ప్లాన్ చేసినట్లు ఒప్పుకున్నాడు. దానిలో భాగంగానే.. పిల్లల్ని చంపేసి ముళ్ల పొదల్లో పడేయాలని నిర్ణయించుకుని ఒక బాలికను దారుణంగా హత్య చేసిన నిందితుడు.. మరో చిన్నారి హత్యకు సిద్ధమైనట్లు పోలీసుల విచారణలో వెల్లడి కావడం కలకలం రేపుతోంది. ఇక.. పాపను హత్య చేసి మేడ్చల్ అటవీ ప్రాంతంలో వేసినట్లు చెప్పడంతో ఆయా ప్రాంతాల్లో గాలించారు పోలీసులు. దాంతో.. అటవీ ప్రాంతంలో మూట కట్టి పడేసిన ఓ సంచిని స్వాధీనం చేసుకున్నారు. పాప డెడ్‌బాడీగా గుర్తించి.. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు పోలీసులు.. కాగా.. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాసరగడి గ్రామంలో గోనె సంచిలో బాలిక మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు. అదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభాకర్ కుటుంబంతో సూరారంలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 12న కుమార్తె ఏం.జోష్న (7) కనిపించడం లేదని సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పోలీసులు బాలిక కోసం దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే.. అనుమానంతో తిరుపతిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల, రైతు కూలీల హామీలు నెరవేర్చలి

**వాస్తవ నేస్తం,బోనకల్:** మండలం కేంద్రంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఇరుగుజానేసు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇంతవరకు రుణమాఫీ లేదు, రైతు భరోసా లేదు, రైతు బంధువు లేదన్నారు. కురిసిన వర్షం పరిహారానికి 10000 వేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు 10000 కాదు కదా పది పైసలు కూడా రైతు ఎకౌంట్లో పడలేదు అంటే ఇంతకంటే దారుణము ఏముంది రైతు కూలీలు బడుగు బలహీన వర్గాలు ప్రజలు వారు ఇచ్చిన హామీలు ఆశతో ఇల్లు ఇస్తామని పెన్షన్ లో నాలుగు వేలు చేస్తామని కళ్యాణ లక్ష్మి లక్ష 116 లు పొలం బంగారం లేదు ఇల్లు లేవు రేషన్ కార్డులు లేవు 500 కి గ్యాస్ లేదు అంబేద్కర్ అభయాసం కింద 12 లక్షలు లేవు ఇలా



ప్రజలను మోసం చేసి గద్దె ఎక్కి ఏ ఒక్కటి హామీ నెరవేర్చలేని ఈ ప్రభుత్వం మేము ప్రజల కోసం సేవ చేస్తామని ప్రజల వద్దకు వచ్చి ఓట్లు వేయించుకొని గెలిచిన తర్వాత రైతులను కానీ రైతు కూలీల కానీ ఆదుకున్న పాపాన లేదు కానీ ఒక ఎమ్మెల్యేకు నెల జీతం రెండు లక్షల 50 వేల రూపాయలు అంటే వారు ఏం కష్టపడుతున్నారని నెలకు వచ్చి ఇంత జీతం తీసుకోవడం ముఖ్యమంత్రి గారికి నెలకు జీతం నాలుగు లక్షల ఇరవై ఒక్క వెయ్యి అంటే మీరు నెలలో ఫస్ట్ తారీకు జీతాలు తీసుకుంటారు ఇవి వారి అలివిన్స్ కాకుండా వారి జీతాలు మరలా ఇంటికి తోడు వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలి ఇది రైతు కూలీలు చేసిన పనిని దోసుకుంటున్న ఈ గెలిచిన నాయకులు కనీసం వారిని పట్టించుకోవడంలేదని ఇలాగే జరిగితే రైతులను రైతు కూలీలను ఇబ్బందులు పెట్టిన ఏ ప్రభుత్వము కొనసాగలేదని తొందరలోనే ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో బుద్ధి చెబుతారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు

# కిడ్నీ వ్యాధి గ్రస్థులకి శుభవార్త..!


**సిద్దిపేట :** సిద్దిపేట డయాలసిస్ సెంటర్ కు మరో 5 పడకలు మంజూరుఇప్పటికే 10 పడకలతో సిద్దిపేట లో డయాలసిస్ సేవలు కొత్త 5 పడకలతో మొత్తంగా 15 పడకలతో అందుబాటులో కి రానున్న డయాలసిస్ సేవలు వ్యయ ప్రయాసల నుండి ఉపశమనం. కిడ్నీ వ్యాధి గ్రస్థులు సద్వినియోగం చేసుకోవాలి...మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.సిద్దిపేట లోని కిడ్నీ వ్యాధి గ్రస్థులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు శుభవార్త చెప్పారు. మరో 5 పడకలు సిద్దిపేట డయాలసిస్ సెంటర్ లో అందుబాటులో కి రానున్న ట్లు హరీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట ప్రాంతం లోని కిడ్నీ వ్యాధి గ్రస్తుల వ్యయప్రయాసలు దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ తరవాత సిద్దిపేట లోనే తొలి డయాలసిస్ సెంటర్ ను మంజూరు చేసుకున్నామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం లో నగరాలకు పరిమితం అయిన ఈ డయాలసిస్ సెంటర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినక తొలి డయాలసిస్ సెంటర్ 5 పడకలతో సిద్దిపేట లో ఏర్పాటు చేసుకున్నాం తరవాత రాష్ట్రం లోని అన్ని నియోజకవర్గాల్లో డయాలసిస్ సేవలు అందుబాటులో కి తెచ్చామన్నారు. కిడ్నీ వ్యాధి తో బాధపడుతున్న రోగులు హైద్రబాద్ వెళ్లే పరిస్థితి. కానీ ఆ బాధను గుర్తించి సిద్దిపేట లోనే సెంటర్ ని ఏర్పాటు చేశామని, ఇలాంటి వ్యాధి తో బాధపడుతున్న వారు ఎంతో మంది, లక్షలు ఖర్చు పెట్టిన నయం కానీ వ్యాధి కానీ ఉచితంగా నయం అయ్యే విధంగా ఇది సిద్దిపేట ప్రజలకు ఒక వరమని చెప్పారు. మొదట 5 పడకలతో మొదలైన డయాలసిస్ సెంటర్ ప్రజల అవసరల దృష్ట్యా మరో 5 పడకలు మంజురు కాగా కొత్తగా హరీష్ రావు మరిన్ని విజ్ఞప్తుల మేరకు మరో కొత్తగా 5 పడకలు మంజురు అయ్యాయి. త్వరలోనే సిద్దిపేట డయాలసిస్ సెంటర్ లో



అందుబాటులోకి రానున్నాయ్. కిడ్నీ వ్యాధి గ్రస్తులకు వరం గా మారనుంది. 78వేల 800 కేసులు, తగ్గిన లక్షల ఖర్చు లు, వ్యయప్రయసలు సిద్దిపేట నియోజకవర్గం లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రత్యేక చొరవ తో రాష్ట్రం లోనే తొలి డయాలసిస్ సెంటర్ 2017 లో మొదట 5 పడకలతో ప్రారంభం అయింది. హరీష్ రావు వచ్చిన అనేక విజ్ఞప్తుల దృష్ట్యా 2019 లో మరో 5 పడకలు మంజూరు చేశారు. ప్రస్తుతం వందల మంది డయాలసిస్ సేవలు అందుబాటులో వస్తున్న తరుణం లో గడిచిన ఈ ఏడు సంవత్సరాలలో 78 వేల కేసులు అంటే వ్యాధి గ్రస్థులు రెండు మార్లు మూడు మార్లు చేసుకుకొనే అవకాశం ఈ డయాలసిస్ సెంటర్ లో బాధితులకు చికిత్స అందింది.. ప్రస్తుత తరుణం లో కిడ్నీ వ్యాధి గ్రస్థులు పెరిగారు, మరో వైపు హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి చేపించుకొనే ఆర్థిక పరిస్థితి లేకపోవడం ఎన్నో వ్యయ ప్రయాసలు లోను కావడం తో ప్రజల నుండి అనేక విజ్ఞప్తులు హరీష్ రావు గారి ద్రుష్టి కి రాగ మరో 5 పడకలు కొత్తగా మంజూరు అయ్యాయి. దీనితో సిద్దిపేట డయాలసిస్ సెంటర్ లో మొత్తం 15పడకల తో డయాలసిస్ సెంటర్ అందుబాటులో కి రానుంది ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలి

**రాజన్న సిరిసిల్ల :** గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై,నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలిఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ అధికారుల,సిబ్బంది పని తీరు భేష్..ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, గ్రామాల్లో విజబుల్ పోలీసింగ్, నేరాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ కార్యాలయం, ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఈరోజు వార్షిక తనిఖీలో భాగంగా ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ కార్యాలయం తనిఖీ చేసి సర్కిల్ పరిదిలో నమోదు అవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో సిడి ఫైల్స్, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించి, కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల పరిరక్షణకు ఆయాఎస్సై ల ద్వారా చర్యలు చేపట్టాలని, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డ్స్ , వర్టికల్స్ అమలు తీరు,స్టేషన్ లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పెండింగ్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సి.డి ఫైల్స్ లను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ. ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, పోలీస్



స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నా రు. నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని,విలేజ్ పోలీస్ అధికా రులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో తరచు పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం విపివో ల దగ్గర ఉండాలని ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు. ఎస్పీ వెంట సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, ట్రైని ఎస్ఐ రాహుల్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు

# పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

**భూపాలపల్లి:** పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో పత్తి కొనుగోలు ప్రక్రియపై మార్కెటింగ్, సహకార, సిసిఐ, పోలీస్,అగ్నిమాపక, వ్యవసాయ కాటన్ మిల్లుల యజమానులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పత్తి కొనుగోలు ఏర్పాట్లకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభం అవుతున్నదని సిసిఐ ద్వారా కొనుగోలు చేయుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నవంబర్ మొదటి వారం నుండి పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలిపారు. జిల్లాలో 93 వేల ఎకరాలలో పత్తి సాగు జరిగిందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోలు సజావుగా, సక్రమంగా సాగేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో ఐదు పత్తి మిల్లులు ఉన్నాయని రైతులు విక్రయాలు చేసేందుకు దగ్గరలో ఉన్న మిల్లులకు ట్యాగింగ్ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన పత్తి నిల్వ ఉంచేందుకు గోదాములను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 25 వ తేదీ వరకు పత్తి కొనుగోళ్ళు ప్రారంభించాలని ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనుగోలు జరపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సీసీఐ ద్వారా మాయిచ్చర్ మిషన్, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో స్థానిక పోలీస్ అధికారుల నెంబర్లు,



అత్యవసర నంబర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. తూనికలు కొలతలు శాఖ ద్వారా ప్రతి కొనుగోలు కేంద్రాలలో కాంటాలకు స్టాంపింగ్ చేయాలని ఆదేశించారు. గోదాములు, మిల్లుల వద్ద అగ్నిపాక శాక ద్వారా అగ్నిప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అన్నారు.

## నేరాలను కట్టడి చేయడానికి గస్తీ పెంచాలి

- సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలి
- జిల్లా ఎస్పీ గౌస్ ఆలం



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** నేరాల కట్టడికి గస్తీ పెంచాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదిలాబాద్ డిఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి సాయుధ బలగాలతో కూడిన బృందం గౌరవ వందనాలు అందించి, ఆదిలాబాద్ డిఎస్పి జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు సునీల్, కరుణాకర్ పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. కార్యాలయ పరిసరాలను చుట్టూ తిరిగి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో ఉన్న పోలీస్ పోలీస్ స్టేషన్లో వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదు దారు పిటిషన్ వెంటనే నమోదు చేసి సంబంధిత అధికారులకు అప్పగించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించినప్పుడే ప్రజలలో పోలీసుల పట్ల మరింత నమ్మకం పెరుగుతుందని తెలిపారు. గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలను పెంచుకోవాలని, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించారని తెలియజేశారు. రాత్రి సమయాలలో అదనంగా గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలను కట్టడి చేసే విధంగా ప్రణాళికను రూపొందించి అవలంబించాలని సూచించారు. సిబ్బంది ఎల్లవేళలా పోలీస్ స్టేషన్లో అప్రమత్తంగా ఉండి ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు లేకుండా అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధులను పర్యవేక్షిస్తూ ఎలాంటి లోపాలను లేకుండా సరిచూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు కరుణాకర్, సునీల్, శ్రీనివాస్, నవీన్ డీఎస్పీ కార్యాలయ సిబ్బంది జైపాల్, రవి, కిష్టయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రావినూతల చర్చి నిర్మాణానికి మంత్రి పొంగులేటి రూ.20వేల విరాళం



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల విజ్ఞప్తి మేరకు తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రావినూతల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చికి రూ. 20వేలను బుధవారం ఉదయం ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విరాళంగా అందించారు. భవిష్యత్తులోనూ చర్చి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విరాళం అందుకున్న చర్చి నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఉమ్మినేని కృష్ణ, భాగం నాగేశ్వరరావు, చర్చి నిర్వాహకులు ఏసుపోగు ప్రభాకర్, తాళ్లూరి రత్నం, తాళ్లూరి ఏసు, తుడుం ప్రసాద్, తాళ్లూరి సామియేలు, కాంపాటి జాన్, తాళ్లూరి వెంకటి తదితరులు ఉన్నారు.

## నీరే ప్రాణాధారం.. అదే నీరు కలుషితం అయితే ప్రాణాంతకం




**వాస్తవ నేస్తం,భీంపూర్:** మనిషికి నీరే ప్రాణాధారం అని అదే నీరు కలుషితం అయితే ప్రాణాంతకం అని,కలుషిత నీటి వల్ల అతిసార,కలరా, టైఫాయిడ్,వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్ లు అన్నారు..బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మిషన్ భగీరథ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో గ్రామ మంచి నీటి సహాయకులకు శిక్షణ శిభిరం ఏర్పాటు చేశారు..హ్యాండ్ పంప్స్,మోటార్స్,లెకేజెస్, రిపేరింగ్స్,నీటి ట్యాంకుల శుభ్రత,బ్లీచింగ్ పౌడర్ కలిపే విధానం పై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో నీటి శుభ్రత బాధ్యత గ్రామ సహాయకుల పై ఉందని తెలిపారు.ఈ శిక్షణ శిభిరం మరో మూడు రోజుల పాటు ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అతుల్,కెమిస్ట్ తిరుపతి,గ్రామ సహాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ భూమి పూజ

**సంగారెడ్డి :** ఆందోల్ నియోజకవవర్గం బస్వపూర్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి మంత్రి దామోదర రాజనర్సింహ భూమియ పూజ చేసారు. మంత్రి మాట్లటాడుతూ తెలంగాణ రావడంలో ఆనాడు కీలక పాత్ర నాదే. సమైక్యాంధ్ర లోనే నేను డిప్యూటీ సీఎంగా ఉన్నాను. అప్పుడూ ఇప్పుడు నేను ఒకేలా ఉన్నాను..ఉంటాను. పదవితో నాకు సంబంధం లేదు...మనిషికి ప్రాంత ప్రీతి ఉండాలి. చేసిన మంచిని ప్రజలు చెప్పుకోరు జనాల్లో ఎంత చేసినా నాకేంటి అనే వైఖరి వచ్చింది.


Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com